# బలగం TV
BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ సోమవారం 14 అక్టోబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


## దివ్యాంగులకు ఉపాధికి ప్రత్యేక వెబ్ పోర్టల్

- నేడు సచివాలయంలో ప్రారంభించనున్న మంత్రి సీతక్క

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దివ్యాంగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా ప్రత్యేక వెబ్ పోర్టల్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. వికలాంగుల జాబ్ పోర్టల్ పేరుతో తీసుకువచ్చినీ ప్రత్యేక పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకుంటే ప్రయివేటు కంపెనీల్లో ప్రభుత్వం ఉపాధి అవకాశాలను చూపించనుంది. ఉపాధి అవకాశాలను మెరుగుపరిచెందుకు ఈ ఆ్లనన్ జాబ్ పోర్టల్‌ను అందుబాటులోకి తెస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. యూత్ ఫర్ జాబ్స్ అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రభుత్వం రూపొందించింది. ఈ ప్రత్యేక పోర్టల్‌ను సోమవారం సచివాలయంలో మంత్రి సీతక్క ప్రారంభించనున్నారు. సోమవారం ఉదయం పదిన్నర గంటలకు వికలాంగుల ప్రత్యేక జాబు పోర్టల్‌ను సీతక్క ఆవిష్కరిస్తారు.



# తెలంగాణ సాధనలో అలయ్ బలయ్ పాత్ర కీలకం

- తెలంగాణ రాజకీయ జేఏసీ ఆవిర్భావానికి అలయ్ బలయ్ ఉపయోగపడింది
- అంతరించిపోతున్న సంస్కృతి సంప్రదాయాలను దత్తాత్రేయ ముందుకు తీసుకువెళ్తున్నారు
- ఈ కార్యక్రమం రాజకీయాలకు సంబంధం లేదు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ సాధనలో 'అలయ్ బలయ్' కీలక పాత్ర వహించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమానికి 'అలయ్ బలయ్' స్ఫూర్తి అన్నారు. హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమానికి సీఎం విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఉత్తరాఖండ్ గవర్నర్ గుర్మిత్ సింగ్, మేఘాలయ గవర్నర్ విజయ్ శంకర్, రాజస్థాన్ గవర్నర్ హరిభౌ కిషన్‌రావ్ బాగ్డే, రాజస్థాన్ గవర్నర్ హరిబాబు పగాడే, మేఘాలయ గవర్నర్ సీహెచ్ విజయ శంకర్, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి, ఎంపీ లక్ష్మణ్, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో అన్ని సామాజికవర్గాలు కార్యోన్ముఖులు కావడానికి అలయ్ బలయ్ దోహదపడిందని తెలిపారు. తెలంగాణ సాధనకు రాజకీయ జేఏసీ ఆవిర్భావానికి కూడా అలయ్ బలయ్ ఉపయోగపడిందని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు అతిపెద్ద పండగ దసరా పర్వదినాన అందరికీ గుర్తొచ్చేది పాలపిట్ట, జమ్మిచెట్టు అన్నారు. మరోవైపు 'అలయ్ బలయ్' అంటే గుర్తొచ్చేది బండారు దత్తాత్రేయ అని కొనియాడారు. తెలంగాణ సంస్కృతిని నలుదిశలా వ్యాపింపచేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. దత్తాత్రేయ వారసత్వాన్ని ఆయన కుమార్తె విజయలక్ష్మి ముందుకు తీసుకు వెళ్లడం అభినందనీయమన్నారు. తెలంగాణ ఉద్యమంలో జెండాలకు అజెండాలకు అతీతంగా ఒక పొలిటికల్ జేఏసీని ఏర్పాటు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడానికి ఈ అలయ్ బలయ్ కార్యక్రమం ఎంతో స్ఫూర్తిగా పనిచేసిందని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమం రాజకీయాలకు సంబంధం లేదని, అంతరిం చిపోతున్న సంస్కృతి సంప్రదాయాలను దత్తాత్రేయ ముందుకు తీసుకువెళ్తున్నారని తెలిపారు.

తొలుత అలయ్ బలయ్ అధ్యక్షు రాలు బండారు విజయలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటైన కార్యక్రమాన్ని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఢంకా మోగించగా, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు లాంఛనంగా ప్రారంభిం చారు. సంప్రదాయ నృత్యాలు, కోలాటం, గిరిజన నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు, పులి వేషాలు అలయ్ బలయ్ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపట్టాయి. హైదరాబాదీ సంప్రదాయ మర్ఫా వాయిద్య సంగీతం విశేషంగా ఆకట్టుకుంది. సీఎం రేవంత్‌రెడ్డిని దత్తాత్రేయ సన్మానించి అంతర్జాతీయ గుర్తింపు పొందిన గొంగళి, కర్ర బహుకరించారు.

వేదిక మీదున్న గవర్నర్‌లు, బీజేపీ నేతలకు కూడా గొంగళి, కర్ర బహుకరించారు.

గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమానికి తప్పకుండా మిగితా 2వ పేజీలో

## సీఎం హెూదాలో తొలిసారి స్వగ్రామానికి రేవంత్‌రెడ్డి



- కొండారెడ్డిపల్లిలో పర్యటించిన సీఎం
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సీఎం రేవంత్ రెడ్డి తొలిసారి తెలంగాణ ముఖ్యమంత్రి హెూదాలో స్వగ్రామం మండలం కొండారెడ్డిపల్లికి వచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి రాకతో కొండారెడ్డిపల్లిలో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. డప్పు దరువులు, కోలాటాలు, పూల జల్లులతో గ్రామస్తులు పెద్ద ఎత్తున హాజరై స్వాగతం పలికారు. ఆ గ్రామంలో ముఖ్యమంత్రి రూ.21 కోట్ల 39 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామ పంచాయితీ భవన ఆవరణలో మొక్కను నాటారు. ఆ తర్వాత ఆంజనేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పునర్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ముఖ్యమంత్రి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గ్రామంలో రూ.72 లక్షల వ్యయంతో నిర్మించిన మోడల్ గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. గ్రామ పంచాయతీ భవనం ఎదుట మామిడి మొక్కను నాటారు. రూ. 55 లక్షలు వెచ్చించి అత్యాధునిక సదుపాయాలతో నిర్మించిన మోడల్ గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించారు. రూ. 18 లక్షల వ్యయంతో అత్యాధునిక సదుపాయాలతో నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేశారు. రూ.18 కోట్లతో చేపట్టే భూగర్భ మురుగు నీటి పైప్ లైన్ నిర్మాణం, మురుగునీటి శుద్ధి కేంద్రం, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ. 64 లక్షలతో అత్యాధునిక ప్రయాణ ప్రాంగణ నిర్మాణం, ప్రధాన రహదారి గుండా విద్యుత్ దీపాలంకరణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే రూ. 32 లక్షల వ్యయంతో చిల్డ్రన్స్ పార్క్, వ్యాయామశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.70 లక్షలతో అధునాతన సదుపాయాలతో కమ్యూనిటీ భవనం, ప్రహరీ గోడ నిర్మాణ పనులను ప్రారంభించారు.

సీఎం రేవంత్ రెడ్డి తన నివాసానికి వెళ్లారు. నివాసంలో కుటుంబసభ్యులు, బంధువులతో కొన్ని గంటల పాటు గడిపారు. సాయంత్రం నివాసం నుంచి గ్రామ శివారులోని జమ్మి చెట్టు వద్దకు ర్యాలీగా వెళ్ళారు. అనంతరం మనవడితో కలిసి జమ్మి పూజలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. అక్కడి నుంచి నేరుగా ఆంజనేయ స్వామి ఆలయంలో మరోసారి పూజలు నిర్వహించారు. అనంతరం సీఎంను గ్రామస్తులు కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులను పలకరిస్తూ వారితో ఫోటోలు దిగారు. ముఖ్యమంత్రి వెంట నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, శాసనసభ్యులు చిక్కుడు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణ రెడ్డి, కూచుకుళ్ల రాజేశ్ రెడ్డి తో పాటు ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైలు పట్టాలపై గ్యాస్ సిలిండర్..

- ఎమర్జెన్సీ బ్రేక్స్ వేసిన గూడ్స్ రైలు లోకో పైలట్
- ఉత్తరాఖండ్‌లో తప్పిన ప్రమాదం

వివరాలు 2వ పేజీలో

## సంగారెడ్డిలో ఇద్దరి మృతికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే




- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్


**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సంగారెడ్డి జిల్లాలో కలుషిత నీరు తాగి ఇద్దరు మృతి చెందడానికి కారణం ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కలుషిత తాగునీరు తాగి సంగారెడ్డి జిల్లాలో ఇద్దరు మరణించిన ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. తెలంగాణ అంతటా తాగునీరు సరఫరా చేయడానికి కేసీఆర్ ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా మిషన్ భగీరథ ప్రాజెక్టు పూర్తి చేసిందని తెలిపారు. కృష్ణా, గోదావరి నదీ జలాలను శుద్ధి చేసి రాష్ట్రమంతటా తాగు నీరు ఇచ్చే ఈ ప్రాజెక్టును కూడా రేవంత్ సర్కార్ సరిగ్గా నిర్వహించలేకపోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సంజీవన్‌రావుపేటలో కలుషిత నీటి సరఫరా వల్ల జరిగిన మరణాలు ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబాలను ఆదుకోవాలని, చికిత్స పొందుతున్నవారికి తగిన సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దురదృష్టకరమైన ఘటనలు తెలంగాణలో మరెక్కడ జరగకుండా చూసుకోవాలన్నారు.

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం సంజీవరావుపేట గ్రామంలోని బీసీ కాలనీలో కొద్దిరోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. మంచి నీరు రాకపోవడంతో అందుబాటులో ఉన్న నీటినే ఆ కాలనీవాసులు తాగారు. కలుషిత నీరు తాగడం వల్ల ఆ కాలనీలో చాలామంది అస్వస్థతకు గురయ్యారు. వారిని స్థానిక ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఇద్దరు దుర్మరణం చెందారు. మరో 50 మంది తీవ్ర అస్వస్థతతో చికిత్స పొందుతున్నారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. దీంతో వారిలో ఇద్దర్ని నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి.. ఒకరిని సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

## మాజీ ప్రొఫెసర్ సాయిబాబా కన్నుమూత



- అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్‌లో మృతి
- నేడు గాంధీ ఆస్పత్రికి భౌతికకాయం అప్పగింత

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఢిల్లీ వర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను కుటుంబసభ్యులు వారం రోజుల కిందట పంజాగుట్టలోని నిమ్స్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందు తూ శనివారం రాత్రి తుది శ్వాస విడిచారు. మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయనే అభియోగాలతో 2014లో సాయిబాబాను పోలీసులు అరెస్టు చేశారు. 2017లో ఆయనకు గడ్చిరోలి సెషన్స్ కోర్టు జీవిత ఖైదు విధించింది. 2017లో సాయిబాబాను నాగ్‌పూర్ జైలుకి తరలించారు. అనంతరం సుప్రీంకోర్టు ఆదేశాలతో బాంబే హైకోర్టు విచారణ చేపట్టింది. సాయిబాబాను నిర్దోషిగా ప్రకటించింది. సుమారు 9 ఏళ్ల పాటు జైల్లో గడిపిన సాయిబాబా.. ఈ ఏడాది మార్చిలో విడుదలయ్యారు.

విద్యావేత్తగా, రచయితగా, మానవ హక్కుల ఉద్యమకారుడిగా సాయిబాబాకు గుర్తింపు ఉంది. 1967లో ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా అమలాపురంలో నిరుపేద రైతు కుటుంబంలో సాయిబాబా జన్మించారు. పోలియో కారణంగా ఐదేళ్ల వయస్సు నుంచే ఆయన వీల్ చైర్‌ను ఉపయోగిస్తున్నారు. జైలులో ఉన్న సమయంలో పలు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొన్నారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని రామ్ లాల్ ఆనంద్ కాలేజీలో చాలా ఏళ్లు ఇంగ్లిష్ బోధించారు సాయిబాబా. మావోయిస్టులతో సంబంధాలు కలిగి ఉన్నారనే కేసులో జైలుకు వెళ్లడంతో.. 2021, ఫిబ్రవరిలో రామ్ లాల్ ఆనంద్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పదవి నుంచి తొలగించారు.

సెషన్స్ కోర్టు ఇచ్చిన జీవిత ఖైదు తీర్పుపై సాయిబాబా అప్పీల్‌కు వెళ్లారు. యూఏపీఏ కేసులో ప్రొసీజర్‌ను పోలీ సులు సరిగా పాటించలేదన్న కారణంతో బాంబే హైకోర్టు 2022లోనే సాయిబాబాపై కేసును కొట్టివేసింది. కానీ వెంటనే మిగితా 2వ పేజీలో



## మండలిలో ప్రతిపక్ష నేతగా మధుసూదనచారి

- బాధ్యతల స్వీకరించిన ఎమ్మెల్సీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

శాసన మండలి ప్రతిపక్ష నేతగా ఎంపికైన బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ మధుసూదనచారి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మధుసూదనాచారికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సత్కరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నూతనంగా శాసన మండలి ప్రతిపక్ష నేతగా నియమితులైన మధుసూదనాచారి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను అంకితభావంతో నిర్వర్తిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా శాసనమండలి తొలి చైర్మన్ స్వామిగౌడ్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు ఎమ్మెల్సీలు మధుసూదనాచారికి శుభాంక్షలు తెలిపి, శాలువాలతో సత్కరించారు.

## సమగ్ర కుటుంబ సర్వే రిపోర్టులు ఏమయ్యాయి..?

- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

గతంలో కెసిఆర్ సమగ్ర కుటుంబ సర్వే జరిపిన విషయాన్ని కాంగ్రెస్ పార్టీ మర్చిపోయిందా? కెసిఆర్ నిర్వహించిన సర్వే రిపోర్టులు ఏమయ్యాయని కంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో ఆదివారం ఏర్పాటు చేసిన అలయ్ బలయ్ కార్యక్రమానికి బండి సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ



సమగ్ర కుటుంబ సర్వే వివరాలు అప్పుడు కెసిఆర్ బయటపెట్టలేదని, ఇప్పుడు వీళ్లు కూడా బయటపెట్టట్లేదని ఆరోపించారు. వీరిద్దరి మధ్య ఉన్న చీకటి ఒప్పందమేమిటో చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్ చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అప్పటి సర్వేతో ఏం లాభం చేకూరిందని, మళ్లీ ఈ రోజు కాంగ్రెస్ కులగణన పేరుతో రూ.150 కోట్లు కేటాయించి, 60 రోజుల సమయం ఇచ్చి సర్వే చేయిస్తుందని అన్నారు. ప్రజల కులాలు మారాయా, లేక కుటుంబసభ్యులు ఏమైనా మారారా? దీనిలో ఉన్న ఉద్దేశం ఏమిటో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. కులగణన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన దుర్మార్గమైనదని, చిత్తశుద్ధితో చేసే ప్రయత్నం చేయట్లేదని విమర్శించారు. ఇదంతా కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమేనని అన్నారు. కేవలం స్థానిక సంస్థల ఎన్నికలను ఆలస్యంగా నిర్వహించేందుకు తప్పించుకునే దోరణిలో వ్యవహరిస్తుందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిపోతామని, ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై ఉన్న వ్యతిరేకతను గుర్తించి ఇదంతా చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయలేదని ప్రజలు నిలదీస్తారని, రుణమాఫీ విషయంలో రైతులు సీరియస్‌గా ఉన్నారని భయపడి కాంగ్రెస్ పార్టీ తప్పించుకునే ధోరణిలో భాగంగానే కులగణన పేరుతో కాలయాపన చేస్తుందని మండిపడ్డారు.

## బన్నీ ఉత్సవంలో 100 మందికిపైగా గాయాలు

### అర్ధరాత్రి వేళ కర్రల సమరం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఏపీలో కర్నూల్ జిల్లా దేవరగట్టులో ప్రతీయేటా దసరా పండుగ సందర్భంగా బన్నీ ఉత్సవాలు జరగడం సంప్రదాయం. ఈ ఏడాది కూడాఉత్సవ మూర్తుల విగ్రహాలను దక్కించుకోవడానికి కర్రలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. అర్ధరాత్రి ఒకటిన్నరకు జరిగిన బన్నీ ఉత్సవంలో 11 గ్రామాల ప్రజలు పాల్గొనగా.. 100మందికిపైగా గాయాలయ్యాయి. వీరిలో 12 మంది పరిస్థితి విషమంగా మారగా.. వారిని చికిత్స నిమిత్తం ఆలూరు, ఆదోని, కర్నూలు ఆసుపత్రికి తరలించారు.


మాళ మల్లేశ్వర స్వామికోసం జరిగిన కర్రల సమరంలో గ్రామాల ప్రజలు కర్రలతో తలపడ్డారు. ఈ క్రమంలో పలువురికి తలలు పగిలి రక్తం చిందింది. ఐరన్ రింగ్ లు తొడిగిన కర్రలు, అగ్గి దివిటీలతో మిగితా 2వ పేజీలో



# 20వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి కసరత్తు

- **ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**
- **అశ్వరావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో రూ.36.50 కోట్లతో నిర్మించిన 2.5 మెగావాట్ల పవర్ ప్లాంట్ ప్రారంభం**

**బలగం టీవి, హైదరాబాద్**



ప్రకృతి వనరులను వినియోగించుకుని కాలుష్యరహితంగా 20వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ప్రయత్నిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో రూ.36.50 కోట్లతో నిర్మించిన 2.5 మెగావాట్ల పవర్ ప్లాంట్‌ను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ..వ్యవసాయ రంగా నికి బడ్జెట్‌లో రూ.73వేల కోట్లు కేటాయించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని తెలిపారు. సౌర విద్యుత్ ఉత్పత్తికి పైలట్ ప్రాజెక్టు కింద గ్రామాలను ఎంపిక చేస్తామని సూచన ప్రాయంగా వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మొట్టమొదటి విజయదశమి ఇది. రాష్ట్ర ప్రజలు విజయాలు పొందే విధంగా ప్రభుత్వం తరపున అండగా ఉంటామని హామీ ఇస్తున్నామన్నారు.ఏ వెసులుబాటు ఉన్నా మిగిలిన రైతులకు కూడా రుణమాఫీ చేస్తామని చెప్పారు. భవిష్యత్‌లో రైతులకు పంటల బీమా ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు.

# తెలంగాణ సాధనలో అలయ్ బలయ్ పాత్ర కీలకం

(మొదటి పేజీ తరువాయి)

వస్తానని చెప్పారని, ఆ మేరకు ఆయన వచ్చి మాట నిలబెట్టుకున్నారని అన్నారు. ఆత్మ విశ్వాసంతో ఎదిగిన వ్యక్తి రేవంత్‌రెడ్డి అని కొనియాడారు. జెడ్పీటీసీ నుంచి సీఎంగా రేవంత్ రెడ్డి అంచలంచెలుగా ఎదిగారని దతాత్రేయ పేర్కొన్నారు. అలాగే తెలుగు రాష్ట్రాల ముఖ్యమం త్రులు కలసిమెలసి రాష్ట్రాల అభివృద్ధి కోసం పని చేయాలని అన్నారు. దేశంలోనే తెలంగాణ, ఏపీ రాష్ట్రాలను అగ్రస్థానంలో నిలపాలని సూచించారు. రాజకీయాలతో సంబంధం లేకుండా 2005లో అలయ్ బలయ్ ప్రారంభించామని, ప్రేమ, ఆత్మీయత, ఐక్యత చాటి చెప్పాలన్నదే అలయ్ బలయ్ లక్ష్యమని వివరించారు. ఈసారి కులవృత్తులకు ప్రాధాన్యత ఇస్తూ అలయ్ బలయ్‌లో ప్రదర్శించామని అన్నారు.

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ అలయ్ బలయ్ సందర్భంగా అందరినీ కలుసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. స్నేహశీలి అయిన బండారు దత్తాత్రేయ ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఓ చక్కని సంప్రదాయాన్ని ఏర్పాటు చేయటం, వారి కుమార్తె విజయలక్ష్మి ఆ సంస్కృతిని కొనసాగించటం అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి కార్యక్రమాలు రాజకీయాలకు అతీతంగా, సమైక్యతా భావాన్ని పెంపొందిస్తాయన్నారు. రాజకీయ విభేదాలు సిద్ధాంతాలకే పరిమితం కావాలని, నేతలు వ్యక్తిగత దూషణలకు దిగితే, అది కార్యకర్తల వరకూ పాకుతుందని, ఇది సమాజ శ్రేయస్సుకు మంచిది కాదని హితవు పలికారు. ఇలాంటి కార్యక్రమాల స్ఫూర్తితో సమాజంలో ఐక్యతా స్ఫూర్తిని, సమిష్టి తత్వాన్ని పెంపొందించేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఆకాంక్షించారు.

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ నాయకులు విమర్శించుకోవాలి, కానీ ప్రజలు అసహ్యించుకునేలా కాదని అన్నారు. నాయకులు మాట్లాడే తీరుతో పాటు భాషలోనూ మార్పు రావాలని అన్నారు. ఎన్నికల సమయం లో ఘర్షణ పడొచ్చని, కానీ ఆ తర్వాత అంతా మర్చిపోయి ప్రజల శ్రేయస్సును కోరుకోవాలని సూచించారు. ప్రస్తుతం పార్టీలు విమర్శించు కుంటున్న తీరును చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు.రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కొందరు మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని, అలాంటి వారికి స్వీయ నియంత్రణ ఉండాలని అన్నారు. తెలంగాణలో మత విద్వేషాలు రెచ్చగొట్టకుండా మాట్లాడేలా దత్తాత్రేయ

# మాజీ ప్రొఫెసర్ సాయిబాబా కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

మహారాష్ట్ర ప్రభుత్వం ఈ తీర్పుపై సుప్రీం కోర్టుకు అప్పీల్‌కు వెళ్లగా.. అత్యున్నత కోర్టు సాయిబాబా విడుదలపై స్టే ఇచ్చింది. కేసును తిరిగి వినాలని బాంబే హైకోర్టుకు రిఫర్ చేసింది. బాంబే హైకోర్టు తీర్పుతో ఈ ఏడాది మార్చి 5న ప్రొఫెసర్ సాయిబాబా విడుదల అయ్యారు.

సాయిబాబా కోరిక మేరకు గాంధీ ఆసుప్రతికి డెడ్‌బాడీని.. ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రికి ఆయన రెండు కళ్లను డొనేట్ చేస్తున్నట్టు కుటుం బ సభ్యులు తెలిపారు. నిమ్స్ మార్చురీ నుంచి సాయిబాబా భౌతిక కాయాన్ని అక్టోబర్ 14 ఉదయం 8 గంటలకు కుటుంబ సభ్యులు తీసుకుంటారు. అనంతరం అక్కడి నుంచి 9 గంటలకు గన్ పార్క్ చేరి అక్కడ.. పావుగంట ఉంచుతారు. అక్కడి నుంచి 10 గంటలకు మౌలాలి కమాన్ దగ్గర శ్రీనివాసా హైట్స్ చేరి అక్కడ మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంచుతారు. మధ్యాహ్నం 2.30 గంటలకు చివరి ఊరేగింపు బయల్దేరి సాయంత్రం 4 గంటలకు సికింద్రాబాద్‌లోని గాంధీ మెడికల్ కాలేజీకి చేరుకుంటుంది. ఈ మేరకు ప్రొఫెసర్ సాయిబాబాకు చివరి శ్రద్ధాంజలి ఘటించే వారు ఆయా స్థలాల్లో ఎక్కడికైనా రావచ్చని కుటుంబ సభ్యులు, ఉద్యమ సహచరులు తెలిపారు.

# పోరాడి ఓడిన భారత్

- **ఆసీస్‌పై ఉత్కంఠ పోరులో 9 పరుగుల తేడాతో ఓటమి**



మహిళల టీ20 వరల్డ్ కప్ సెమీస్ రేసులో కీలక మ్యాచ్‌లో భారత జట్టు పోరాడి ఓడింది.భారీ ఛేదనలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(54 నాటౌట్) ఆఖరి దాకా పోరాడినా గెలుపు ఆసీస్‌దే అయ్యింది.

షార్జా వేదికగా డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాతో భారత్ తలపడింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 151/8 పరుగులు చేసింది. గ్రేస్ హారిస్ (40), తహ్లియా మెక్‌గ్రాత్ (32), ఎలిసా పెర్రీ (32) దూకుడుగా ఆడారు. భారత బౌలర్లలో రేణుకా సింగ్, దీప్తి శర్మ రెండేసి వికెట్లు తీయగా శ్రేయాంక పాటిల్, పూజా వస్త్రాకర్, రాధా యాదవ్ తలో వికెట్ తీశారు.

ఇక, 152 పరుగుల భారీ ఛేదనలో ఓపెనర్లు షఫాలీ వర్మ(20), స్మృతి మంధాన(6) లు విఫలమైనా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(54 నాటౌట్) ఆఖరి దాకా పోరాడింది. దీప్తి శర్మ(29)తో 63 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టును గెలుపు దిశగా నడిపింది. అయితే.. ఆసీస్ బౌలర్లు పుంజుకొని ఆఖర్లో వరుసగా వికెట్లు తీశారు. దాంతో, టీమిండియాకు ఓటమి తప్పలేదు. భారత జట్టు నిర్ణీత ఓవర్లలో 142/9 పరుగులకే పరిమితమైంది. దాంతో 9 పరుగుల తేడాతో గెలుపొందిన ఆస్ట్రేలియా సెమీస్ బెర్తుకు మరింత చేరువైంది.

ప్రస్తుతం గ్రూప్-ఎలో ఉన్న అస్ట్రేలియా ఇప్పటికే సెమీస్ బెర్త్ ఖాయం చేసుకుంది. మరోవైపు, భారత జట్టు నాలుగు పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. న్యూజిలాండ్ కూడా నాలుగు పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. అయితే, న్యూజిలాండ్‌కి మరో మ్యాచ్ మిగిలి ఉంది. సోమవారం(నేడు) పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో న్యూజిలాండ్ గెలిస్తే భారత్ టోర్నీ నుంచి నిష్క్రమించినట్టే.

## కాంగ్రెస్ నాయకులను
# ఈడీ నుంచి రక్షిస్తున్న పెద్దన్న ఎవరు?

- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులపై ఈడీ దాడులు జరుగుతున్నా ఎవరూ నోరు మెదపడం లేదని, తెలంగాణలో కాంగ్రెస్ నాయకులను ఈడీ నుంచి రక్షిస్తున్న పెద్దన్న ఎవరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఫిక్షన్ కంటే వాస్తవం వింతగా ఉంటుందని అంటుంటారని.. రాష్ట్రంలో జరుగుతున్న కొన్ని సంఘటనలు చూస్తుంటే దాన్ని నమ్మక తప్పడం లేదని కేటీఆర్ అన్నారు. అందుకు సంబంధించిన రెండు ఘటనలను ట్విట్టర్(ఎక్స్) ద్వారా వివరించారు. తెలంగాణలో ఒక సంపన్నమైన కాంగ్రెస్ మంత్రి నివాసంలో రెండు వారాల కిందట ఈడీ దాడి చేసిందని తెలిపారు. ఆ దాడిలో వందల కోట్ల నగదు దొరికిందని మీడియాలో కథనాలు వస్తున్నాయని అన్నారు. అయితే ఇప్పటికీ కాంగ్రెస్ గానీ.. బీజేపీ నుంచి గానీ.. ఈడీ నుంచి గానీ దానిపై నోరు మెదపలేదన్నారు. కర్ణాటకలో జరిగిన వాల్మీకి కుంభకోణం ద్వారా వచ్చిన రూ. 40 కోట్ల అక్రమ ధనాన్ని పార్లమెంటు ఎన్నికల సమయంలో తెలంగాణలో కాంగ్రెస్ ఉపయోగించిందని ఈడీ వెల్లడించిందని కేటీఆర్ గుర్తుచేశారు. అయితే ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టులు ఏమీ జరగలేదని తెలిపారు. వీటన్నింటి బట్టి ఈడీ నుంచి తెలంగాణలో కాంగ్రెస్ నాయకులను రక్షిస్తున్న పెద్ద అన్న ఎవరై ఉంటారని ప్రశ్నించారు.



# రైలు పట్టాలపై గ్యాస్ సిలిండర్..


- **ఎమర్జెన్సీ బ్రేక్స్ వేసిన గూడ్స్ రైలు లోకో పైలట్**
- **ఉత్తరాఖండ్‌లో తప్పిన ప్రమాదం**

**బలగం టీవి, డెహ్రాడూన్**

ఉత్తరాఖండ్‌లో పెద్ద రైలు ప్రమాదం తప్పింది. రూర్కీ సమీపంలో రైల్వే ట్రాక్‌పై ఎల్పీజీ గ్యాస్ సిలిండర్‌ను గుర్తు తెలియని దుండగులు ఉంచారు. రైలు పట్టాలపై సిలిండర్‌ను గమనించిన గూడ్స్ రైలు లోకో పైలట్ అప్రమత్తమై ఎమర్జెన్సీ బ్రేక్స్ వేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. లలాండౌర్ - ధందేరా స్టేషన్ల మధ్య ఈ ఘటన శనివారం చోటు చేసుకోగా, ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. ఉత్తరాఖండ్‌లోని ధందేరా రైల్వే స్టేషన్ మీదుగా ఓ గూడ్స్ రైలు వెళ్తుండగా.. ఈ స్టేషన్‌కు సమీపంలో రైలు పట్టాలపై గ్యాస్ సిలిండర్‌ను ఎవరో పెట్టారు. లోకో పైలట్ అప్రమత్తమై ఎమర్జెన్సీ బ్రేకులు వేసి, ప్రమాదాన్ని తప్పించాడు. వెంటనే అధికారులను అప్రమత్తం చేశాడు. ఘటనాస్థలానికి చేరుకున్న రైల్వే అధికారులు.. సిలిండర్‌ను స్వాధీనం చేసుకుని పరిశీలించారు. అది ఖాళీదని నిర్ధారించారు. స్థానిక పోలీసులు, జీఆర్పీ అధికారులు, స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే ఈ ట్రాక్ వెంట సైనికులకు సంబంధించిన ఆర్మీ వాహనాలను తరలిస్తుంటారు. గూడ్స్ రైళ్లను కూడా సైనిక కార్యకలాపాల కోసం ఈ ట్రాక్‌ను వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు రైసింగ్ అకాడమీ క్రీడాకారుడు..

**బలగం టీవీ ,సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎస్ జి ఎఫ్ యు /14 క్రికెట్ సెలక్షన్స్ గత 4 వ తేది నా నిర్వహించగా ఈ సెలక్షన్స్ లో అద్భుత ప్రదర్శన కనబరిచిన శైలేష్ (8వ తరగతి ) రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు రైసింగ్ అకాడమీ నుండి ఎంపికయ్యాడని అకాడమీ క్రికెట్ కోచ్ సాయి తేజ ఒక ప్రకటనలో తెలిపారు... రాష్ట్ర స్థాయి క్రికెట్ కు ఎంపికైన క్రీడాకారుడు ఈనెల 14 నుండి 17 వరకు జోగులాంబ గద్వాల లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు.. రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారుడిని స్థానిక ప్రజాప్రతినిధులు అభినందించారు...

# బన్నీ ఉత్సవంలో 100 మందికిపైగా గాయాలు

(మొదటి పేజీ తరువాయి)

జైత్రయాత్ర కొనసాగింది. బన్నీ ఉత్సవాన్ని చూసేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. బన్నీ ఉత్సవం నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కర్నూల్ జిల్లా హొళగుంద మండలం దేవరగట్టులో ప్రతీయేటా దసరా సందర్భంగా కర్రల సమరం జరగడం సంప్రదాయంగా వస్తుంది. దాదాపు 800 అడుగుల ఎత్తైన కొండపై వెలసిన మాళ మల్లేశ్వరస్వామి ఉత్సవంకు విశేష ప్రాముఖ్యత ఉందని అక్కడి స్థానికులు చెబుతారు. ఇక్కడ స్వామి దేవతా మూర్తులను కాపాడుకోవడానికి నెరణికి, నెరణికితండా, కొత్తపేట గ్రామాల భక్తులు ఒకవైపున.. అరికెర, అరికెరతండా, కురుకుంద, బిలేహాల్, సుళువాయి, ఎల్లార్తి, విరుపాపురం గ్రామాల భక్తులు మరోవైపున కర్రలతో కొట్లాటకు దిగారు.

# సరిపోయింది శనివారం


## ఉప్పల్‌లో అదరగొట్టిన టీమిండియా.. భారత్ స్కోరు : 297/6

## బంగ్లాదేశ్‌పై భారత్ భారీ విజయం.. సిరీస్ కైవసం




**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్ ఉప్పల్ వేదికగా జరిగిన చివరి టీ20 మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై భారత్ ఘన విజయం సాధించింది. గెలుపంటే



మాములు గెలుపు కాదు సంజూ శాంసన్ విధ్వంసకర సెంచరీతో చెలరేగగా.. సూర్యకుమార్ యాదవ్ హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. చివర్లో రియాన్ పరాగ్, హార్దిక్ పాండ్యా మెరుపులు మెరిపించారు. దాంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లో 6 వికెట్లకు 297 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఇది ఇంటర్నేషనల్ క్రికెట్‌లో రెండో అత్యధిక స్కోర అనంతరం 298 పరుగుల భారీ లక్ష్య ఛేదన కోసం బరిలోకి దిగిన బంగ్లాదేశ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 164 పరుగులు మాత్రమే చేసింది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ 3–0 తేడాతో గెలిచింది.

ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లో 6 వికెట్లకు 297 పరుగుల భారీ స్కోర్ చేసింది.

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. ఆదిలోనే ఓపెనర్ అభిషేక్ శర్మ వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత సంజూ శాంసన్ (111 పరుగులు, 47 బంతుల్లో, 11 ఫోర్లు, 8 సిక్సర్లు), సూర్య కుమార్ యాదవ్ (75 పరుగులు, 35 బంతుల్లో, 8 ఫోర్లు, 5 సిక్సులు) ఆకాశమే హద్దుగా చెలరేగారు. ఆ తర్వాత రియాన్ పరాగ్ (34), హార్దిక్ పాండ్య (47) సైతం బ్యాట్ ఝుళిపించడంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 297 పరుగుల భారీ స్కోరు చేసింది.బంగ్లాదేశ్ బౌలర్లలో తంజిమ్ హసన్ షకీబ్ మూడు వికెట్లు తీయగా.. ముస్తాఫిజుర్ రెహ్మాన్, మహ్మదుల్లా, టస్కిన్ అహ్మద్ తలో వికెట్ తీసారు.

అనంతరం లక్ష్యచేధనకు దిగిన బంగ్లాదేశ్‌కు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. ఇన్నింగ్స్ తొలి బంతికే బంగ్లాదేశ్ ఓపెనర్ పర్వేజ్ హొసేన్(0) గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. మయాంక్ యాదవ్ బౌలింగ్‌లో క్యాచ్ ఔటయ్యాడు. ఆ కాసేపటికే దూకుడు కనబర్చిన తంజిద్ హసన్(15)ను వాషింగ్టన్ సుందర్ ఔట్ చేయగా.. కెప్టెన్ నజ్ముల్ హొసేన్ షాంటో(14)ను రవి బిష్ణోయ్ పెవిలియన్ చేర్చాడు. టౌహిడ్ హృదయ్(42 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 63 నాటౌట్) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించగా.. లిటన్ దాస్(25 బంతుల్లో 8 ఫోర్లతో 42) పర్వాలేదనిపించాడు. భారత బౌలర్లలో రవి బిష్ణోయ్ మూడు వికెట్లు తీయగా.. మయాంక్ యాదవ్ రెండు వికెట్లు పడగొట్టాడు. వాషింగ్టన్ సుందర్, నితీష్ కుమార్ రెడ్డి తలో వికెట్ తీసారు.

# బాబర్ అజామ్‌పై వేటు..!

- పాకిస్థాన్ క్రికెట్ బోర్డు సంచలన నిర్ణయం
- ఇంగ్లండ్‌తో రెండు, మూడు

**బలగం టీవి, హైదరాబాద్**

ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టెస్టులో పాకిస్థాన్ మొదటి ఇన్నింగ్స్‌లో 556 పరుగులు సాధించి కూడా ఇన్నింగ్స్ 47 పరుగుల తేడాతో ఓటమిపాలవ్వడంతో..పాకిస్థాన్ క్రికెట్ బోర్డు సంచలన నిర్ణయం తీసుకుంది. ఇంగ్లండ్‌తో జరగనున్న రెండు, మూడు టెస్టులకు స్టార్ క్రికెటర్లపై వేటు వేస్తూ జట్టును ఆదివారం ప్రకటించింది. బాబర్ అజామ్‌తో పాటు అనుభవజ్ఞులైన షాహీన్ షా అఫ్రిది, నసీమ్ షా, సర్ఫరాజ్ అహ్మద్‌లను జట్టు నుంచి పాక్ సెలక్షన్ కమిటీ తప్పించింది. స్టార్ ప్లేయర్, మాజీ కెప్టెన్ బాబర్ అజామ్‌ను జట్టు నుంచి తప్పించడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది. ఇదిలా ఉండగా అన్‌క్యాప్డ్ ప్లేయర్లు హసీబుల్లా, మెహ్రాన్ ముంతాజ్, కమ్రాన్ గుహ్లామ్‌లతో పాటు ఫాస్ట్ బౌలర్ మహ్మద్ అలీ, ఆఫ్ స్పిన్నర్ సజీద్ ఖాన్‌లకు అవకాశం ఇచ్చింది. షాన్ మసూద్ సారథ్యంలో 16 మందితో కూడిన జట్టును పాక్ బోర్డు ప్రకటించింది.


2022 డిసెంబర్ తర్వాత నుండి బాబార్ అజామ్ టెస్టుల్లో కనీసం హాఫ్ సెంచరీ కూడా చేయలేదు. ముల్తాన్ వేదికగా జరిగిన ఫ్లాట్ పిచ్‌పై



కూడా రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 35 పరుగులే చేశాడు. కాగా, బాబర్ అజామ్ ఇటీవల పరిమిత ఓవర్ల ఫార్మాట్ల కెప్టెన్సీ నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే.

**ఇంగ్లండ్‌తో 2,3 టెస్టులకు ఎంపికైన పాకిస్థాన్ జట్టు:**

షాన్ మసూద్ (కెప్టెన్), సౌద్ షకీల్ (వైస్ కెప్టెన్), అమీర్ జమాల్, అబ్దుల్లా షఫీక్, హసీబుల్లా (వికెట్ కీపర్), కమ్రాన్ గులామ్, మెహ్రాన్ ముంతాజ్, మీర్ హమ్జా, మహ్మద్ అలీ, మహ్మద్ హురైరా, మహ్మద్ రిజ్వాన్ (వికెట్ కీపర్), నోమన్ అలీ, సయిమ్ అయుబ్, సాజిద్ ఖాన్, సల్మాన్ అలీ అఘా, జాహిద్ మెహమూద్.




# 'విశ్వంభర' టీజర్ విడుదల


**బలగం టీవి, హైదరాబాద్**

మెగాస్టార్ చిరంజీవి నటిస్నుత్న 'విశ్వంభర' సినిమా టీజర్ దసరా కానుకగా విడుదలైంది. చిరంజీవి మాస్ అవతార్, పవర్‌ఫుల్ డైలాగులు, గ్రాండ్ విజువల్స్‌తో ఈ టీజర్ ఆద్యంతం సినీప్రియులను అలరించేలా సాగింది. ఊహించని రేంజ్ విజువల్స్ తో మరో లోకం లోకి తీసుకెళ్లింది టీజర్. రెక్కల గుర్రం మీద మెగాస్టార్ ఎంట్రీ, ఫైట్స్, గ్రాఫిక్స్ అదుర్స్ అనే చెప్పుకోవాలి. ఈ సినిమాలో చిరంజీవి రోల్ గతంలో ఎన్నడూ చూడని విధంగా ఉంటుందని స్పష్టమైంది. ఇక కీరవాణి స్కోర్ ఈ టీజర్ లో మరో హైలైట్. సోషియో ఫాంటసీ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వం వహిస్తుండగా.. కోలీవుడ్ స్టార్ హీరోయిన్ త్రిష కథానాయికగా నటిస్తుంది. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి ఆర్‌ఆర్‌ఆర్ ఫేం లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి బ్యాక్ గ్రౌండ్ స్కోర్, సంగీతం అందిస్తున్నారు.

## జనవరి 10న'గేమ్ ఛేంజర్'

**బలగం టీవి, హైదరాబాద్**

తమిళ స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న గేమ్‌ఛేంజర్ సినిమాను భారీ బడ్జెట్‌తో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమాను సంక్రాంతి కానుకగా జనవరి 10న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది.అయితే సంక్రాంతికి మెగాస్టార్ చిరంజీవి విశ్వంభర రానున్నట్లు ముందుగా ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ ఈ సినిమాను గేమ్ ఛేంజర్ కోసం వాయిదా వేసుకున్నారు. దీనిపై నిర్మాత దిల్ రాజు కూడా వీడియో రూపంలో అధికారిక ప్రకటన ఇచ్చారు.







## 'దేవర'కు రూ.500 కోట్లు..!

**బలగం టీవి, హైదరాబాద్**

ఎన్టీఆర్ కథానాయకుడిగా వచ్చిన దేవర చిత్రం తాజాగా రూ.500 కోట్ల క్లబ్‌లోకి ఎంటర్ అయ్యింది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. మొదటిరోజు రూ.172 కోట్ల వసూళ్లను రాబట్టిన సంగతి తెలిసిందే. కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయికగా నటించగా. సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటించాడు. నందమూరి కల్యాణ్‌రామ్ సమర్పించగా.. యువసుధా ఆర్ట్స్ పతకంపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె సంయుక్తంగా నిర్మించారు.

# దసరా స్పెషల్.. కొత్త సినిమా పోస్టర్లు..

దసరా పండుగ సందర్భంగా టాలీవుడ్ నుంచి పలు సినిమాల పోస్టర్లు విడుదలయ్యాయి. ఆయా నిర్మాణ సంస్థలు ఆయా సినిమాలకు సంబంధించిన పోస్టర్‌లను రిలీజ్ చేస్తూ దసరా పండుగ శుభాకాంక్షలు చెప్పారు. ఈ దసరా సందర్భంగా రిలీజైన పోస్టర్‌లు చూసుకుంటే..













